

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సుగుణాబాయ్

ధాన్యం తడవకుండా చూసుకోవాలి

కీసర, మే 21(ఆంధ్రజ్యోతి): ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ సుగుణాబాయ్ అన్నారు. బుధవారం కీసరలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు పండించిన ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పలిన్లు కప్పాలని సూచించారు. సరిపడా కవర్లు లేకుంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని, అవసరమైన టార్పలిన్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తూకం అయిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలన్నారు. విక్రయించిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు జరిగిన కొనుగోళ్లు, రైతుల ఖాతాల్లో నగదు జమ వివరాలను తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న విద్యా శాఖ రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ మున్నూరు రాజు

విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులే కీలకం

» విద్యా శాఖ పరిశీలకుడు డాక్టర్ రాజు

వికారాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులే కీలకమని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని విద్యా శాఖ రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ మున్నూరు రాజు అన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వ డైట్ కళాశాలలో కొనసాగుతున్న తెలుగు భాషోపాధ్యాయుల వృత్యంతర శిక్షణా శిబిరాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా తెలుగు బోధనపై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండా ఇతర అంశాలను బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతులపై సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. పాఠ్యాంశాల బోధనకు సాంకేతికతను జోడించాలని, ఐసీటీ, దీక్షా యాప్ తదితర నూతన మార్పులను ఆకలింపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ఏఎంవో రామ్మస్త, ఎస్‌వో రజిత, డీఆర్‌పీలు సుధాకర్‌గౌడ్, ఎన్నారం శ్రీనివాస్, ఘనాపురం పరమేశ్వర్, రాజ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

భూసారం నిస్సారం!

- భాస్వరం, పొటాషియం అనేక రెట్లు ఎక్కువ
- జింకు, సేంద్రియ కర్బనాల లోపం
- విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం
- పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం
- వ్యవసాయాధికారుల సలహాలు పాటిస్తే మేలు



ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ భూములు రోజురోజుకూ నిస్సారంగా మారుతున్నాయి. పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే ఆత్రుతతో రైతులు రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడేస్తున్నారు. మొక్క మొలిచింది మొదలు... పూత పూసి.. కాయ కోసే వరకు మందుల వినియోగం మితిమీరిపోయింది. ఇలా చేయడం వల్ల నేలల్లో నత్రజని పూర్తిగా తగ్గిపోయినట్లు కేంద్రం ఇటీవల నిర్వహించిన భూసార పరీక్షల్లో వెల్లడైంది. అంతేకాకుండా భాస్వరం, పొటాషియం ఉండాల్సిన మోతాదు కంటే అనేక రెట్లు అధికంగా ఉన్నట్లు తేలింది. భూమంతా భాస్వరమయంగా మారడంతో పంట ఉత్పత్తుల్లో వ్యత్యాసాలు వస్తున్నాయి. ఇప్పటికైనా రైతులు మేలుకోకపోతే మున్ముందు వ్యవసాయ భూములు సాగుకు పనికిరాకుండా పోయే ప్రమాదముంది.




ఉమ్మడి జిల్లా నేలల్లో తగ్గిన నత్రజని

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడడంతో భూసారంలో భారీ వ్యత్యాసాలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయి. కేంద్రం ఇటీవల నిర్వహించిన భూసార పరీక్షల్లో ఉమ్మడి జిల్లాలో ఆశ్చర్యకరమైన విషయాలు వెల్లడయ్యాయి. మొక్కల ఎదుగుదలలో కీలకమైన నత్రజని శాతాన్ని పెంచేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నా ఇంకా మెరుగుపడలేదు. కొన్ని ప్రాంతాల్లో కనీస స్థాయిలో కూడా నత్రజని లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అలాగే భాస్వరం, పొటాషియం ఉండాల్సిన మోతాదు కంటే అనేక రెట్లు అధికంగా ఉన్నట్లు తేలింది. రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులు వాడడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. తాజా భూసార పరీక్షల్లో మూడు జిల్లాల్లోని భూముల్లో నత్రజని లోపం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలో 99.4శాతం భూముల్లో నత్రజని లోపం ఉన్నట్లు ఫలితాల్లో వెల్లడైంది. అలాగే రంగారెడ్డిజిల్లాలో 57.5శాతం నత్రజని లోపం కనిపించింది. మేడ్చల్ జిల్లాలో 17.8శాతం తక్కువ నమోదైంది. అలాగే సేంద్రియ కర్బన పదార్థాలు., సల్ఫర్, ఇనుము, జింకు, కాపర్, బొరాన్ లోపం ఎక్కువగానే ఉంది. పంటల సీజన్ ప్రారంభం కాగానే వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలను పట్టించుకోకుండా రైతులు పోటీపడి ఎరువులను వాడుతున్న విషయం తెలిసిందే. దీంతో భూసారంలో

మిగతా 7వ పేజీలో...

పరీక్షల ఫలితాలు

భూసార లోపం (శాతాల్లో)



సమాచారం

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి ఎస్. శంకర్ తెలిపారు. ప్రతి రోజు రెండు విడతల్లో పరీక్షలు ఉంటాయని, ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 5.30 గంటల వరకు ఉంటాయని వివరించారు. విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు.

'టీబీ ముక్త్ అభియాన్' సర్వే

వికారాబాద్/ధారూరు, మే 21(ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా మే 22 నుంచి ఆగస్టు 29 వరకు వంద రోజుల పాటు రోగుల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వై.వెంకటరవణ, రవీంద్రయాదవ్ తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్, హెచ్‌ఐవీ, పొగతాగే అలవాటు ఉన్నవారు, గతంలో టీబీ వ్యాధి ఉన్న వారు, టీబీ రోగుల కుటుంబ సభ్యులపై క్షేత్రస్థాయి సిబ్బంది తెముడ పరీక్షలు, ఛాతి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించనున్నారన్నారు. ఇందుకోసం పోర్టబుల్ ఎక్స్‌రే మిషన్‌ను వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. 2030 నాటికి భారత్‌ను టీబీ రహిత దేశంగా మార్చే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. టీబీ చికిత్స పొందుతున్న వారికి నెలకు రూ.1,000 చొప్పున ఆహార భద్రత కోసం ఆర్థిక సహాయం అందిస్తున్నామని, దాతలు ముందుకు వస్తే ఫుడ్ బాస్కెట్లు కూడా అందిస్తామని తెలిపారు. అలాగే క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా ధారూరు పీహెచ్‌సీ పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వైద్యాధికారి శాంతి తెలిపారు. ఎవరైనా టీబీ అనుమానితులుంటే వివరాలు తెలపాలని కోరారు.



దంచికొట్టిన వాన

తాండూరులో 57.3 మి.మీ. వర్షపాతం నమోదు

- ఏరులై పారిన రహదారులు
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



బొంరాస్‌పేట్‌లో వర్షానికి తడుస్తున్న ధాన్యం



వికారాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పలుచోట్ల ఉదయం నుంచి వర్షం కురియగా, కొన్ని చోట్ల మధ్యాహ్నం తర్వాత మొదలై రాత్రి వరకు కురుస్తూనే ఉంది. వాగులు, వంకల్లో వరద నీరు భారీగా ప్రవహించింది. తాండూరులో అత్యధికంగా 57.3 మి.మీ. వర్షం కురిసింది. వికారాబాద్ మండలం, మద్గుల్ చిట్టంపల్లిలో 43.3 మి.మీ. వర్షం కురియగా, యాలాల్‌లో 38.3 మి.మీ., మర్పల్లిలో 36.8 మి.మీ., బషీరాబాద్‌లో 33.8 మి.మీ., కొడంగల్‌లో 31.3 మి.మీ., పూడూరు మండలం, పెద్ద ఉమ్మెంతాల్‌లో 22.5 మి.మీ., బొంరాస్‌పేట్‌లో

మిగతా 8వ పేజీలో...



తాండూరులో జలమయమైన సాయిపూర్‌నకు వెళ్లే రోడ్డు

మర్పల్లిలో భారీ వర్షం

మర్పల్లి: మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో రోడ్లపై వరద పారింది. కాలనీల్లో ఇళ్ల ముందు వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షాలతో జొన్న, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తాండూరులో జలమయం

తాండూరు: కురిసిన భారీ వర్షంతో రోడ్లపై భారీగా వరద నీరు నిలిచి జనం ఇబ్బంది పడ్డారు. గంటన్నర పాటు వర్షం కురిసింది. శాంతినగర్, సాయిపూర్, నంబర్ వన్ హైస్కూల్, భవానీ నగర్, బసవన్నకట్ట, మిత్రనగర్, బృందావన్ కాలనీ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచింది. డ్రెయిన్లు నిండి రోడ్లపై పారింది.

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో!

నాగారం మున్సిపాలిటీలో నత్తనడకన పనులు

- భారీ వాహన రాకపోకలతో లేస్తున్న దుమ్ము, కంకర
- ప్రమాద సూచికలు లేక తరుచూ యాక్సిడెంట్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కీసర రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిర్మాణ పనులు మూడు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కి అన్నచందంగా జరుగుతున్నాయి. నగర విస్తరణతో పాటు పెరిగిన ట్రాఫిక్‌కు అనుకూలంగా ఉండేందుకు ప్రభుత్వం రోడ్డు విస్తరణను చేపట్టింది. చర్లపల్లి నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు, నాగారం మున్సిపాలిటీలోని రాంపల్లి చౌరస్తా నుంచి యంనంపేట్ వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణ పనులను ప్రభుత్వం హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌ఆర్‌డీసీఎల్)కు అప్పగించింది. రోడ్డు నిడివి మొత్తం 14 కిలో మీటర్లు కాగా ఇందుకు

మిగతా 8వ పేజీలో...



రాంపల్లి నుంచి చర్లపల్లి వెళ్లే రోడ్డులో తేలిన కంకర

రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి



రోడ్డు నిర్మాణ పనుల ఆలస్యం అవుతుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవటంతో అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. పలువురు మృత్యువాత పడ్డారు. రోడ్డు నిర్మాణ పనులు వెంటనే పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మంచాల మహేందర్, రాంపల్లి

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

» డీపీవో జయసుధ

బొంరాస్‌పేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని డీపీవో జయసుధ అన్నారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం నర్సరీలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే గ్రామ పంచాయతీని సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో వెంకన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి సిద్ధు ఉన్నారు.



కార్మికులకు వేతనాలివ్వరేం?

- విలీన గ్రామాల కార్మికులకు అందని జీతాలు
- ఆరు నెలలుగా పెండింగ్‌లోనే..



ఉపాధి పని వేళల్లో మార్పులు

- పని ప్రదేశాల్లో సౌకర్యాల కల్పనకు ఆదేశం
- టెంటు, తాగు నీరు, ప్రథమ చికిత్స కిట్స్ ఉండాల్సిందే..
- ఫిర్యాదులకు 18002001001 టోల్ ఫ్రీ నంబర్

తాండూరు, మే 21(ఆంధ్రజ్యోతి): సగం ఎండకాలం పూర్తయ్యాక సర్కారు స్పందించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని వేళల్లో మార్పులు చేశారు. ప్రస్తుతం ఎండలు పెరిగిన దృష్ట్యా ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత ఉపాధి హామీ పనులు చేయించాలని, ఈ పనుల సమయాల్లో తీసుకొచ్చిన మార్పు విషయాన్ని కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఏపీఓలు అవగాహన కల్పించాలని గ్రామాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీ చేసింది. పని స్థలాలకు నిర్దత పని వేళల్లో వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదే. పని ప్రదేశం గ్రామం నుంచి ఐదు కిలో మీటర్ల దూరంలో ఉంటే అదనంగా 10 శాతం కూలి అందేలా చూడాలి. వేసవి దృష్ట్యా పనులు జరిగే చోట కూలీలకు నీడ కోసం టెంట్లు వేయించాలి. ప్రతి కూలీకి ఐదు లీటర్ల మంచి నీటి సౌకర్యం కల్పించాలి. ప్రథమ చికిత్స కిట్స్‌తోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి. కూలీలు అస్వస్థతకు గురైతే వెంటనే సమీప ఆస్పత్రికి తరలించాలి. సమస్యలుంటే గ్రామీణభివృద్ధి శాఖ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం టోఫ్రీ నంబర్ 18002001001లో సంప్రదించాల్సి ఉంటుంది.

అధికారికంగా భాగ్యరెడ్డివర్మ జయంతి

తాండూరు, మే 21(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, రాజకీయవేత్త భాగ్య రెడ్డివర్మ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని సర్కారు నిర్ణయించింది. రాష్ట్ర కార్యక్రమంగా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. మున్సిపల్, స్థానిక సంస్థల్లో జయంతి ఉత్సవాలను నిర్వహించాలని బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి.

జీలుగ విత్తనాలు సరఫరా చేయాలి

కులకచర్ల, మే 21(ఆంధ్రజ్యోతి): సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. వర్షాకాలం రానున్న తరుణంలో జీలుగ, పచ్చిరొట్ట, జనుము విత్తనాల సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 25న రోహిణి కార్తె ప్రారంభం కానుంది. 45 రోజుల్లో పంటలు విత్తుకోనున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

సాగులో అధికారుల సూచనలు పాటించాలి

మర్పల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి పొందొచ్చని మర్పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్లూర్ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రసాయన ఎరువుల అధికంగా వాడితే భూసారంతగ్గుతుందన్నారు. సేంద్రీయ ఎరువుల వాడకంతో దిగుబడి పెరుగుతుందన్నారు. శాస్త్రవేత్తలు రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త యమున, ఏవో శ్రీకాంత్, కాంగ్రెస్‌మండల అధ్యక్షుడుసురేశ్ పాల్గొన్నారు.

రేపు రైతులకు అవగాహన కార్యక్రమం

పెద్దేముల్: వర్షాకాలంలో సాగుపై రైతులను సమాయత్తం చేసేందుకు తాండూరు వ్యవసాయపరిశోధన స్థానం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని ఏవో పవన్‌ప్రీతమ్ తెలిపారు. పెద్దేముల్‌లోని రైతువేదికలో 'రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు, శుక్రవారం ఉదయం 8గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.


కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు


ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

అధికారుల తీరుతో రైతులకు నష్టం

ధారూరు, మే21(ఆంధ్రజ్యోతి): అధికారులు వెంటవెంటనే ధాన్యం కొనుగోలు చేయక వర్షాలతో వడ్లు తడిసి రైతులు నష్టపోతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నాగారం, గురుదోట్ల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను బుధవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో హమాలీల కొరత, లారీలు రాక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. సమస్య పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. తడిస వడ్లను కొంటామని మంత్రులు చెబుతున్నా మిల్లర్లు తూకంలో భారీ కోతలు పెడుతున్నారని చెప్పారు. జిల్లాలో బాయిల్డ్ రైస్ కోసం ధాన్యం నిల్వకు ఇంటర్మీడియరీ గోదాంలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమస్యలన్నీ తీర్చాలని జిల్లా కలెక్టర్, డీఎస్‌వోలను ఆయన కోరారు. కాగా గురుదోట్లలో ఏఈవో సంజూరాథోడ్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజునాయక్, వివేకానందరెడ్డి, సుధాకర్ ఆచార్య పాల్గొన్నారు.

వెంటవెంటనే ధాన్యాన్ని తరలించాలి

బొంరాస్‌పేట్/తాండూరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలం కొత్తూర్ కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడారు. లారీలు రావడం లేదని, బస్తాలు ఇవ్వడం లేదని రైతులు ఆయనతో వాపోయారు. స్పందించిన అధికారి రైతుల సమస్యలు తీరుస్తామని చెప్పారు. తాండూరు మండలం చెంగోల్ కొనుగోలు కేంద్రాన్ని లింగ్యానాయక్ సందర్శించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని తహసీల్దార్ తారాసింగ్, డీసీఎంఎస్ అధికారి సలీంపాషాను ఆదేశించారు.


రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

మొక్కలు విరివిగా నాటాలి

శామీర్‌పేట, మే 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ కార్యక్రమంలో భాగంగా 'ఉమెన్స్ ఫర్ ట్రీ' నినాదంతో మొక్కలు నాటాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ పిలుపునిచ్చారు.మొక్కలు నాటే కార్యక్రమంపై బుధవారం కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. అమృత్ కార్యక్రమంలో భాగంగా మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ సునీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటగోపాల్

అమృత్ 2.0 లక్ష్యాలు సాధించాలి

తాండూరు: కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0కింద అమృత్ మిత్రలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని గొల్ల చెరువు కట్టపై అమృత్ 2.0 కింద మొక్కలు నాటే కార్యక్రమానికి స్థల పరిశీలన చేసి సూచనలు చేశారు. మొక్కలు నాటడం, సంరక్షణ బాధ్యత అమృత్ మిత్రలదే అన్నారు. మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అమృత్ మిత్రలు ఈ నెల 23 వరకు తల్లిపేరిట మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మణిపాల్, టీఎంసీ రాజేంద్రప్రసాద్, కోఆర్డినేటర్ విశాల, నాయకులు రామకృష్ణ, హబీబ్ లాల, లింగదళి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాపరాతి వ్యర్థాలతో

పానాది రోడ్డు మూసివేత!

తాండూరు రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): రైతులు, స్థానికుల ఉపయోగం కోసం ఏళ్లుగా ఉన్న పానాది రోడ్డును ఓ నాయకుడు నాపరాతి వ్యర్థాలు పోసి మూసేశాడు. లీజు ఒక చోట పొంది మరో చోట తవ్వకాలు చేస్తూ అక్రమాలకు పాల్పడున్నాడు. రోడ్డు మూతతో ప్రజలు చుట్టూతిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఓగీపూర్-కరన్‌కోట్, ఛత్రసాలకు వెళ్లేందుకు 80ఫీట్ల రోడ్డును నిర్మించారు. అయితే గ్రామాల నుంచి కర్ణాటకలోని ఛత్రసాలకు వెళ్లే రోడ్డును ఓ కాంగ్రెస్ నాయకుడు ఇది తన పట్టా భూమి అని కొలతలు వేయించి ఆ రోడ్డులో తవ్వకాలు చేపట్టాడు. రాళ్లు, మట్టి కుప్పలతో రోడ్డును మూసేశాడు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మూసేస్తున్నా అధికారులు పట్టించుకోరా? అని ప్రయాణికులు పేర్కొంటున్నారు. తన భూమి సర్వే చేయించగా అందులో నుంచి రోడ్డు వెళ్తోందని ఓగీపూర్‌నకు చెందిన ఓ నాయకుడు ఆభూమిలో నాపరాతి తవ్వకాలకు సిద్ధం చేశాడు. గతంలో ఇచ్చిన లీజు పత్రాలను చూపుతూ తవ్వకాలు చేస్తున్నాడు. రోడ్డు మూసివేతతో కరన్‌కోట్, ఓగీపూర్, తాండూరు, కర్ణాటక రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి నాయకుడి చెరనుంచి రోడ్డును విడిపించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై పోసిన నాపరాతి వ్యర్థాలు


కుచించుకుపోయిన ఓగీపూర్-ఛత్రసాల లింకు రోడ్డు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలనుఅమలు చేయడంలోకాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ ఉందన్నారు. తులం బంగారం బాకీ ఉందని ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తప్పాఅని ఆమె అన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణానాయక్, తహసీల్దార్ సైదులు, కమిషనర్‌వాణి పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే 'కాలె' చెంతకు.. ఏఎంసీ పంచాయితీ

● ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లకు మందలింపు

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, మే 21(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఏఎంసీ పాలకవర్గ పంచాయితీ ఎట్టకేలకు ఎమ్మెల్యే కాలె యాదయ్య చెంతకు చేరింది. ఏఎంసీలో నెలకొన్న విభేదాలు ఒక్కసారిగా రచ్చకెక్కడం, పాలకవర్గంలో లుకలుకలు బహిర్గతం కావడం వంటి అంశాలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఏఎంసీ ఛైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ ఛైర్మన్ రాములు, కొంతమంది డైరెక్టర్లు ఒకరిపై మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం.. ఈవిషయం కాస్త దిన పత్రికలు, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భేదాభిప్రాయాలు మరింత అధికమయ్యాయి. ఈ విషయాన్ని పలువురు పార్టీ సీనియర్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య దృష్టికి తీసుకెళ్లారు. దాంతో బుధవారం ఏఎంసీ ఛైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌ఛైర్మన్ రాములుతో పాటు డైరెక్టర్లను చేవెళ్లలోని క్యాంపు ఆఫీసుకు పిలిపించుకుని యాదయ్య మందలించారు. మీరేమైనా ఓటింగ్‌తో పదవుల్లోకి వచ్చారనుకుంటున్నారా? మీవి నామినేటెడ్ పదవులు అనే విషయాన్ని తెలుసుకోండి.. ఇలా చేస్తే పదవులు ఊడుతాయంటూ హెచ్చరించారు. మరోసారి మీ పంచాయితీ పేపర్లకు (పత్రికల్లో) ఎక్కితే బాగుండదని వార్నింగ్ ఇచ్చారు. అందరూ కలిసి పనిచేసుకోవాలని, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పాలకవర్గానికి సూచించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు మొక్కలు నాటారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ధారూరు, మే21(ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాలకు చెందిన 30మందికి బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఛైర్మన్ కె.విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, నాయకులతో కలిసి రూ.17.3లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తన దుకాణాల తనిఖీ

ధారూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ధారూరులోని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలను బుధవారం పరిగి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీకుమారి తనిఖీ చేశారు. మనగ్రోమోర్, తుల్జాభవానీ ఎరువుల దుకాణాల్లో తనిఖీ నిర్వహించి స్టాక్, రికార్డులను, పీసీలు, ఇన్వాయిస్‌లను తనిఖీ చేశారు. పీసీలు లేకుండా విత్తనాలు విక్రయించరాదని ఆదేశించారు. రైతులకు రశీదులు తప్పక ఇవ్వాలని, నిర్దేశించిన ధరలకే విత్తనాలు అమ్మాలని ఆమె తెలిపారు. ఆమె వెంట ఏవో సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న ఏడీఏ లక్ష్మీకుమారి


భూసారం..నిస్సారం!



చెక్కులను అందిస్తున్న గంప వెంకటేశ్

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆమనగల్లు, మే 21(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ కోరారు. అర్హులైన రైతులందరికీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం దీర్ఘకాలిక రుణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. లోడిగ లక్ష్మయ్యకు ట్రాక్టర్, డైరీ ఏర్పాటుకు రూ.10 లక్షలు, బాలగోని కృష్ణయ్యకు డైరీ పరిశ్రమకు రూ.8 లక్షల దీర్ఘకాలిక రుణాల చెక్కులను బ్యాంకు మేనేజర్ అరుణతో కలిసి అందించారు. వెంకటేశ్ మాట్లాడుతూ రైతులకు దీర్ఘకాలిక రుణాలు ఎకరాకు రూ.4 లక్షల చొప్పున రూ.20 లక్షల వరకు అందిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం పంటల సాగుకు ఆమనగల్లు పీఏసీఎస్ ద్వారా రూ.2 కోట్లు అందించాలనే లక్ష్యం నిర్ణయించినట్లు తెలిపారు. డీసీసీబీ మేనేజర్ అరుణ, కిసాన్ మిత్ర డైరెక్టర్ రమేశ్, సింగిల్ విండో సీఈవో దేవేందర్, మహేశ్, రైతులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి


కందుకూరు, మే 21(ఆంధ్రంజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని దెబ్బడగూడ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లను మహేంద్రకుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా 60మంది నిరుపేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందజేసినట్లు ఆయన గుర్తుచేశారు. దెబ్బడగూడలోని నిరుపేద కుటుంబానికి చెందిన సురక్షిత, ప్రవీణలకు సైకిళ్లను అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా అదనపు కార్యదర్శి తాళ్ల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌తోనే పేదల ప్రగతి

షాద్‌నగర్, మే 21(ఆంధ్రజ్యోతి): పేదల ప్రగతి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కూడు, గూడు కోసం పేదలు ఎన్నో అవస్థలు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నరలోపే కూడు కోసం సన్న బియ్యం, గూడు కోసం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి సీఎం రేవంత్‌రెడ్డి పేదల గోస తీర్చారని కొనియాడారు. వంట చేసుకోవడానికి రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్న ఘనత ఒక్క తెలంగాణకే దక్కుతుందన్నారు. అర్హులైన వారందరికీ దశల వారిగా ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ బాబర్ ఖాన్, నాయకులు కె.చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, బాలరాజు గౌడ్, బస్వం, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షల ఫలితాలు

అధిక భూసారం (శాతాల్లో)







(ఐదో పేజీ తరువాయి)

సమతుల్యత లోపించి పంట భూములు విషతుల్యంగా మారుతున్నాయి. ఈ కారణంగా పంటల దిగుబడిపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది. ప్రస్తుత భూసార పరీక్షల నివేదికల ప్రకారం ఉమ్మడి జిల్లాలో డీఏపీ , పొటాష్ వాడకాన్ని రైతులు బాగా తగ్గించాల్సి ఉంటుంది. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా వ్యవసాయాధికారులు ఇచ్చే సిఫారస్సుల మేరకు రైతులు ఎరువులు వినియోగిస్తే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. భూసారంలో సమతుల్యత కాపాడుకోవడమే కాకుండా పెట్టుబడి ఖర్చు తగ్గి ఆదాయం కూడా పెరుగుతుంది.



మరిన్ని పోషక లోపాలు


ఇక పంటలకు ముఖ్యమైన సేంద్రియ కర్బనాలు తక్కువగానే ఉన్నాయి. సేంద్రియ కర్బనాలు వికారాబాద్ జిల్లాలో 81.4శాతం భూముల్లో తక్కువగా ఉండగా, మేడ్చల్‌లో 58.9 శాతం, రంగారెడ్డి జిల్లాలో 31.6 శాతం తక్కువగా ఉన్నాయి. అలాగే ఇనుము, జింక్, కాపర్, బోరాన్ కూడా తక్కువగానే నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లాలోని 83.1 శాతం భూముల్లో ఇనుము లోపం కనిపించింది. అలాగే వికారాబాద్‌లో 66.9శాతం, మేడ్చల్‌లో 27.8శాతం భూముల్లో తక్కువ ఉంది. మూడు జిల్లాల్లో కూడా బోరాన్ లోపం కనిపించింది.


భూమంతా 'భాస్వర'మయం


రంగారెడ్డిజిల్లా, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని భూముల్లో భాస్వరం చాలా అధికంగా ఉంది. వికారాబాద్ జిల్లాలో 94.8శాతం భూముల్లో భాస్వరం ఉండాల్సిన దాని కంటే అధికంగా ఉంది. అలాగే మేడ్చల్ జిల్లాలో 80శాతం, రంగారెడ్డిజిల్లాలో 48.5శాతం భాస్వరం అధికంగా ఉన్నట్లు ఫలితాల్లో తేలింది. అలాగే వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లోని భూముల్లో పొటాష్ అధికశాతం ఉండగా రంగారెడ్డిజిల్లాలో తక్కువగా ఉంది. వికారాబాద్ జిల్లాలో పొటాష్ 80శాతం అధికంగా ఉండగా మేడ్చల్ జిల్లాలో 74.4శాతం ఎక్కువగా ఉంది. ఇదే సమయంలో రంగారెడ్డిజిల్లాలో 35.7శాతం పొటాష్ తక్కువగా నమోదైంది. గతంలో రంగారెడ్డిజిల్లాలో కూడా పొటాష్ 80శాతానికిపైగా ఉండేది. ఇక్కడ గడిచిన కొన్నేళ్లుగా పొటాష్ వాడకం రైతులు తగ్గించడంతో ఈ మేర భూసారంలో దాని శాతం తగ్గింది. సాధారణంగా పొటాషియం ఒక హెక్టార్‌కు 280కిలోలకు మించి ఉండకూడదు. వికారాబాద్, మేడ్చల్‌లో కూడా పొటాష్ వాడకాన్ని నియంత్రించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.


మట్టి పరీక్షల ఫలితాలు


భూసార లోపం (శాతాల్లో)











ఎమ్మెల్యే చొరవతో నీటి సమస్య పరిష్కారం

కేశంపేట, మే 21(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో వారం రోజులుగా నీటి ఎద్దడి నెలకొంది. సమస్యను కాంగ్రెస్ నాయకుడు బీస కరుణాకర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోగా, 7 హెచ్‌పీ మోటర్ పంపు ఇప్పించారు. బుధవారం బోరు మోటరు దించి కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.

గర్భిణులకు మెడికల్ కిట్లు

మాడ్గుల, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణీలకు మెడికల్ కిట్లు అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో కిట్లను సమకూర్చగా బుధవారం ఆయన అనుచరులు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కొప్పుల శివకుమార్ పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

షాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): శ్రీరంగపురం మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని లక్ష్మారావుగూడ కురుమ సంఘం అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన శ్రీరంగపురం మల్లయ్య కుటుంబ సభ్యుడు కుమార్‌కు బుధవారం ఆయన రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కురుమ సంఘం మండలాధ్యక్షుడు మద్దూర్ పాండు, కోశాధికారి కుమార్, సభ్యులు శ్రీశైలం, నర్సింహులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

చేవెళ్ల, మే 21(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ఈనెల 29 వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు ఉంటాయని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ సీఆర్‌పీసీ అమలు చేస్తారని, సమీపంలో ఉన్న జిరాక్స్‌షాపులు మూసివేయాలని ఆయన పేర్కొన్నారు.



శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్

సాంకేతిక విద్యాబోధన అవసరం

» ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్

కొత్తూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలుపరుస్తున్న సాంకేతికను ఉపయోగిస్తూ విద్యార్థులకు బోధించాలని, సాంకేతికపై ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో అవగాహక కల్పించేందుకే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ సూచించారు. విద్యను బలోపేతం చేసేందుకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని బుధవారం డైరెక్టర్ రమేష్ సందర్శించారు. శిక్షణ అందజేస్తున్న ఆర్‌పీలతో పాటు ఉపాధ్యాయులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుంటున్న నూతన స్కీంలు, పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. శిక్షణ కేంద్రం పనితీరుపై డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులను సన్మానించారు. కోర్సు డైరెక్టర్ స్థానిక ఎంఈవో అంగోర్ నాయక్ మాట్లాడుతూ బడి బాట ద్వారా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఆర్‌పీలు సులేమాన్‌రాజు, సత్యనారాయణ, శ్రీలత, అన్నపూర్ణ, వసంతలక్ష్మి, శోభరాణి, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడ్తాల్ ఎస్సైకి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు

కడ్తాల్, మే 21(ఆంధ్రజ్యోతి): కడ్తాల్ ఎస్సై వరప్రసాద్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. 2024లో ఉత్తమ నేర పరిశోధనకుగాను అవార్డు లభించింది. తెలంగాణ పోలీసు శాఖ ప్రతీ ఏటా ఉత్తమ నేర పరిశోధనలకు రాష్ట్రస్థాయిలో అవార్డులు ప్రదానం చేస్తుంది. కడ్తాల్ మండలం మక్తమాదారం వద్ద జరిగిన ఓ హత్య కేసును సమయస్ఫూర్తితో ఛేదించినందుకు ఉత్తమ నేర పరిశోధన అవార్డుకు అప్పటి సీఐ వరప్రసాద్, ఎస్సై వరప్రసాద్, హోంగార్డు పాండులను అవార్డులకు ఎంపిక చేశారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై వరప్రసాద్‌కు డీజీపీ జితేందర్ అవార్డుతో పాటు క్యాష్ రివార్డును అందించారు. వరప్రసాద్‌ను డీజీపీ అభినందించారు. రాష్ట్రస్థాయిలో నేర పరిశోధన అవార్డు రావడం పట్ల వరప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. అవార్డు విధుల పట్ల తన బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు.



డీజీపీ నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్సై వరప్రసాద్



జగ్గంగూడ పంచాయతీ వద్ద కార్మికులు

70మంది కార్మికులకు విముక్తి

మూడుచింతలపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గంగూడ పరిధిలోని ఇటుకబట్టీలో ఒడిశాకు చెందిన కొందరు కార్మికులు పనిచేస్తున్నారు. అయితే వారిని ఇటుకబట్టీ యజమాని హింసిస్తున్నాడని, వసతులు కల్పించకపోగా వేతనాలు కూడా ఇవ్వడంలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం అధికారులు 70మంది కార్మికులను వెట్టి చాకిరీ నుంచి రెస్క్యూ చేసి కాపాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో పేదల సొంతింటి కల సాకారం

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల్: మక్తమాదారంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్/ఆమనగల్లు, మే 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో నిరుపేద కుటుంబాల దశాబ్దాల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో సాకారమవుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం, నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. కడ్తాల మండలం మక్తమాదారంలో 21 మందికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్‌లను బుధవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీత నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే అందించారు. అదేవిధంగా మక్తమాదారం నుంచి పెద్దిరెడ్డి చెరువు తండా వరకు నూతనంగా నిర్మించే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆమనగల్లు మండలం సీతారాంనగర్ తండా, సంకటోనిపల్లిలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ సురేశ్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవోలు సుజాత, మాధురి, ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, నాయకులు బిక్యానాయక్, గుర్రం కేశవులు, ధనుంజ, అనిత, విజయ్, బీక్యానాయక్, జగన్, మానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి



అహల్యాబాయిహోల్కర్ జయంతి కార్యక్రమంలో మహిళలు

ఘట్‌కేసర్ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): ధీర వనిత రాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలను బుధవారం ఎదులాబాద్‌లోని రంగనాయకస్వామి ఆలయంలో నిర్వహించారు. జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి భోగ శ్రావణి మాట్లాడుతూ.. అహల్యాబాయిహోల్కర్ దేశంలో మొట్టమొదట సైనిక దళాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, లక్ష్మి, శోభారెడ్డి, విజయలక్ష్మి, సుగుణ పాల్గొన్నారు.

31 వరకు అహల్యాబాయి హుల్కర్ జయంతి వేడుకలు



వికారాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

వికారాబాద్: అహల్యాభాయ్ హుల్కర్ జయంతి వేడకల్లో భాగంగా మే 21 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో ఆలయాల్లో హారతి, మహిళా నాయకులతో, చేనేత కార్మికులతో సమ్మేళనాలు, శోభాయాత్రలు నిర్వహిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం అహల్యాబాయి 300వ జయంతి ఉత్సవాల్లో సందర్భంగా కార్యవర్గ సమావేశం జిల్లా కన్వీనర్ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్లు విజయలక్ష్మి, మాధవి, మహిళా మోర్చా అధ్యక్షులు అన్నపూర్ణ, మహేశ్వరి, మోహన్‌రెడ్డి, సుధాకర్, గోవర్ధన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో స్నేహభావం పెంపు



బొడ్రాయి పూజలో పట్నం మహేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు

షాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ఐక్యత వెల్లివిరుస్తుందని, స్నేహభావం పెంపొందుతుందని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాందార్‌ఖాన్‌పేట్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ఐక్యత వెల్లివిరుస్తుందన్నారు. ఆపదలో ఉన్నప్పుడు గ్రామ దేవతలే కష్టనష్టాల నుంచి కాపాడుతారని, బొడ్రాయి ఉత్సవాలను ఊరంతా ఏకమై కులమతాలకతీతంగా జరుపుకోవాలన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు లింగం, జనార్దన్‌రెడ్డి, ఖాజామియాపటేల్, నాయకులు సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గౌరీశ్వర్, శేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు. అదేవిధంగా షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు ఆయనను సన్మానించారు.

లారీలు రావు.. ధాన్యం పోదు

బొంరాస్‌పేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే తూకం వేసిన వడ్లను మిల్లులకు తరలించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. మండలంలోని మెట్లకుంట, బొంరాస్‌పేట్, కొత్తూర్ ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం బస్తాలు తూకం వేసి రవాణాకు సిద్ధంగా ఉంచినా లారీలు రాకపోవడంతో అకాల వర్షానికి ధాన్యం తడిసిపోతుంది. మెట్లకుంట ఐకేపీ కేంద్రంలో 10 లారీల ధాన్యం బస్తాలు కాంటే వేసి ఉన్నా వారం రోజులుగా లారీలు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. బొంరాస్‌పేట్‌లో ఎనిమిది లారీల ధాన్యాన్ని తూకం వేసి ఉంచినా రెండు రోజులుగా ఒక్క లారీ కూడా రాలేదు. లారీల కోసం ఈసారి ముగ్గురు కాంట్రాక్టర్‌లను ఏర్పాటు చేసినా ఫలితం లేకుండాపోతోంది.



బొంరాస్‌పేట్‌లో తూకం వేసి నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు

శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో

కొడంగల్, మే 21(ఆంధ్రజ్యోతి):ఐదు రోజులు బోధన అభ్యాసాలపై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రాంరెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణను బుధవారం ఆయన పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్, లైఫ్ స్కిల్స్, కెపాసిటీ బిల్డింగ్, టీచింగ్ మెథడ్స్, క్వాలిటీ ఎడ్యుకేషన్ తదితర వాటిపై ఉపాధ్యాయులకు శిక్షణ కొనసాగుతుందని ఎంఈవో తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న ఆర్‌సీ.గౌడ్

తాండూరు రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): మల్కాపూర్ గ్రామానికి చెందిన మాసంపల్లి ఆశమ్మ బుధవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మండల బీఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు ఆర్‌సీ.గౌడ్.. ఆమె అంత్యక్రియల నిమిత్తం కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, ఆర్సీగౌడ్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాండూరు రూరల్, మే21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని 33/11కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ డీఈ వి.భానుప్రసాద్ బుధవారం తెలిపారు. జినుగుర్తి, కోటబాస్పల్లి గ్రామాల పరిధిలోని సబ్‌స్టేషన్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కులకచర్ల: మండలంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ అహ్మద్ బుధవారం పేర్కొన్నారు. పుట్టపహాడ్ 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నామని, కులకచర్ల, పుట్టపహాడ్, బండవెల్కిచర్ల, ముజాహిద్‌పూర్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

నూతన బోర్ల ప్రారంభం

వికారాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పరిధి కొత్రేపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ నిధులతో రెండు బోర్లను మంజూరు చేశారు. బుధవారం బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్, దిశ కమిటీ సభ్యులు వడ్లనందు బోర్లను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యాస్కి శిరీష, నర్సిములు, వినోద్, పృథ్వీరాజ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విలీన గ్రామాల కార్మికులకు వేతనాలివ్వరేం?

- ఆరు నెలలుగా జీతాలందక కష్టాలు


నీటి ట్రాక్టర్‌పై విధులు నిర్వహిస్తున్న కార్మికులు

పరిగి, మే 21(ఆంధ్రజ్యోతి): పరిగి మునిసిపల్‌లో విలీనమైన పంచాయతీ కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. నస్కల్, రుకుంపల్లి, సుల్తాన్‌పూర్, సయ్యద్‌మల్కాపూర్, నజీరాబాద్‌తండా పంచాయితీలు పరిగి మునిసిపాలిటీలో విలీనమయ్యాయి. గత జనవరిలో ఈ గ్రామాలన్నీ మున్సిపల్ పరిధిలోకొచ్చాయి. ఈ పంచాయితీల్లో పనిచేస్తున్న తమకు పంచాయతీ గానీ, మున్సిపాలిటీ గానీ వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు వాపోతున్నారు. ఐదు పంచాయతీల్లో ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు తదితర వాహనాన్ని మునిసిపల్ ఆధీనంలోకి వచ్చాయి. 25మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. విలీనం కాకముందు డిసెంబరు, విలీనమయ్యాక జనవరి నుంచి వేతనాలు ఇవ్వడంలేదని వాపోతున్నారు. విధులు నిర్వహిస్తున్నా జీతాలివ్వకపోతే తమ కుటుంబాల పోషణ ఎలా? అని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని తమకు వేతనాలివ్వాలని కోరుతున్నారు.

జీతం ఇవ్వకుంటే కుటుంబ పోషణ ఎట్ల?



డిసెంబరు నుంచి జీతం ఇవ్వడం లేదు. ప్రతిరోజూ విధులు మాత్రం నిర్వహిస్తున్నాం. జీతం ఇవ్వకపోతే జీవితం ఎలా గడుస్తుందో అధికారులకు తెలియదా? ఎన్నిసార్లు అడిగినా ఇప్పుడు.. అప్పుడు అని కాలం గడుపుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జీతాలిచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- కిష్టయ్య, కార్మికుడు, సయ్యద్ మల్కాపూర్

అధికారులకు ప్రతిపాదనలు పంపించాం



మునిసిపల్‌లో విలీనమైన పంచాయతీల కార్మికులకు వేతనాలు ఇవ్వని విషయం నిజమే. ఈ పంచాయతీ కార్మికుల వేతనాల గురించి కలెక్టర్ ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే అన్ని గ్రామాల కార్మికులకు జీతాలు విడుదలయ్యే అవకాశం ఉంది.

- వెంకటయ్య, కమిషనర్, పరిగి మున్సిపాలిటీ

దేశంలో గ్రామాల అభివృద్ధికి పాటుపడిన నేత రాజీవ్‌గాంధీ


మేడ్చల్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


దేవరయంజాల్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

శామీర్‌పేట, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రధానిగా దేశంలోని గ్రామాల అభివృద్ధికి పాటుపడిన నేత రాజీవ్‌గాంధీ అని జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తూంకుంటలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ 34వ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవరయంజాల్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి జైపాల్‌రెడ్డి, సీతారామస్వామి ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి,జగదీశ్ గౌడ్, మధుసూదన్‌రెడ్డి, శంకర్‌గౌడ్, రాము, శ్రీనివాస్‌యాదవ్, మురళిగౌడ్, ధర్మారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేశారు. అలాగే శామీర్‌పేటలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైఎస్‌గౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘట్‌కేసర్: రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని నాయకులన్నారు. ఘట్‌కేసర్ అంబేడ్కర్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేష్‌గౌడ్, ముల్లి పావని, ముత్యాలు, రాధాకృష్ణ, మశ్చేందర్‌రెడ్డి, వెంకటేశ్, అనిత, అమర్, మల్లేష్, రవీందర్, కుమార్, సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, రహమాన్, పారుక్, నరేష్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: రాజీవ్‌గాంధీ వర్ధంతిని మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డిల ఆధ్వర్యంలో వివేకానంద చౌరస్తా వద్ద రాజీవ్ చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. అలాగే గుండ్లపోచంపల్లిలో మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌కు నివాళులర్పించారు.కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు మర్రి నర్సింహారెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లింది మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీయేనని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా దేశ సంక్షేమానికి నూతన ఒరవడిని సృష్టించి పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. సమావేశంలో పరిశీలకులు వినోద్‌రెడ్డి, నరేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పార్థసారథి, పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్లు బి.పరశురాంరెడ్డి, ఆంజనేయులు, నాయకులు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ఇ.కృష్ణ, సురేందర్,విజయ్‌కుమార్‌రెడ్డి, ఎ.అశోక్, నారాయణ, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కీసరగుట్ట ఆలయ కమిటీ డైరెక్టర్ సామల అమర్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కందుల కుమార్, గాయరు విశ్వనాథం, మెట్టు రమేష్, నర్సింహ, ఓంప్రకాశ్, జవ్వాజీ సత్తయ్య, ఎండీ ఇక్బాల్, రమేష్, కృష్ణచ నరేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎదులాబాద్‌లో రాజీవ్‌గాంధీవిగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మే 21(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో పరిశీలకులు వినోద్‌రెడ్డి, రాంశెట్టి నరేందర్‌లతో కలిసి మాట్లాడారు. పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వారి మద్దతు పొందాలని సూచించారు. పార్టీని నమ్ముకున్నవారికి పార్టీ వెన్నుదన్నుగా ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కార్యకర్తలు తిప్పికొట్టాలని కోరారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పార్థసారథి, పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌లు బి.పరశురాంరెడ్డి, ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు సురేందర్, విజయ్‌కుమార్ రెడ్డి, ఎ.అశోక్, కేఎం.నారాయణ, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో ఆక్రమణలను తొలగించాలి

శామీర్‌పేట, మే 21(ఆంధ్రజ్యోతి):ఆలయ భూముల్లో గోదాములను ప్రభుత్వం వెంటనే తొలగించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలను చేస్తామని పార్టీ జిల్లా నాయకుడు నూనెముంతల రవీందర్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం శామీర్‌పేటలో ఆయన మాట్లాడారు. దేవరయంజాల్‌లోని సర్వే నంబర్లు-216, 217లలో సీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన 1,400 ఎకరాల్లో కొందరు బడాబాబులు గోదాములు నిర్మిస్తున్నారని తెలిపారు. ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ భూములను కాపాడకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

దంచికొట్టిన వాన


కొడంగల్‌లో కురుస్తున్న వర్షం

(ఐదో పేజీ తరువాయి)

21.0 మి.మీ. వర్షం కురిసింది. వికారాబాద్‌లో 18.5మి.మీ., దోమలో 17.8 మి.మీ, ధారూరులో 15.8 మి.మీ, పెద్దేముల్‌లో 13మి.మీ, కులకచర్ల మండలం, పుట్టపహాడ్‌లో 10.5 మి.మీ, కోట్‌పల్లిలో 9.మి.మీ, పరిగి మండలం, రాపోల్‌లో 7మి.మీ, బంట్వారంలో 6.5మి.మీ, దౌల్తాబాద్‌లో 3మి.మీ, నవాబ్‌పేట్‌లో 2.5మి.మీ., పూడూరు మండలం, మన్నెగూడలో 2.3మి.మీ, చౌడాపూర్‌లో 1మి.మీ, యాలాల్ మండలం, ఏఆర్ఎస్ స్టేషన్‌లో 0.5మి.మీ చొప్పున వర్షం కురిసింది.

వికారాబాద్: వికారాబాద్‌లో మధ్యాహ్నం వర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లపై వరద పారింది. గోధుమగూడ వద్ద రైల్వే ట్రాక్ కింద కల్వర్టు రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

బొంరాస్‌పేట్: మండలంలో అకాల వర్షంతో బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ధాన్యపు రాశులు తడిసిపోయాయి. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కొడంగల్: కొడంగల్ పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లపై వర్షపు నీరునిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వడ్లు తడిసిపోయాయి. ఉన్నట్టుండి వర్షం కురవడంతో ధాన్యం రాశులపై కప్పేందుకు టార్పాలిన్లు లేక ఇబ్బందులు పడ్డారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం


దౌల్తాబాద్: డబుల్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావ్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం అంతారంలో గల హైదరాబాద్-బీజాపూర్ రహదారి నుంచి ఈర్లపల్లి వరకు రూ.40కోట్లతో నిర్మించే డబుల్ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామం, తండా సమగ్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రమోద్‌రావు, విజయ్ కుమార్, వెంకట్రాములు, కోటం రాములు, వీరన్న, రాజశేఖర్‌రెడ్డి, రెడ్డి శ్రీనివాస్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.


పెద్దేముల్: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

పెద్దేముల్: కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యం అని పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. జనగాం శివారులోని బీరప్ప ఆలయానికి సీసీరోడ్డు పనులు చేపట్టారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డితో కలిసి రోడ్డు పనులు ప్రారంభించారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎస్డీఎఫ్ నుంచి రూ.8లక్షలు మంజూరు చేయగా ఆలయానికి రోడ్డు వేస్తున్నట్టు చెప్పా రు. గ్రామాలతో పాటు ఆలయాల అభివృద్ధికి కూడా ఎమ్మెల్యే కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సిములు, శివకుమార్, పెంటప్ప, లక్ష్మప్ప, పెద్దనర్సప్ప, అనంతయ్య, శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో!

(ఐదో పేజీ తరువాయి)

సుమారు రూ.210 కోట్లను కేటాయించింది. ఆరు నెలల క్రితం ప్రారంభమైన నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు.

తవ్వి వదిలేశారు

రోడ్డు విస్తరణలో భాగంగా పాత రోడ్డుతోపాటు పక్కన స్థలంలో తవ్వకాలు చేపట్టారు. కొద్ది దూరం తవ్వి వదిలేయడంతో ఏర్పడిన గుంతల్లో మురుగు నీరు చేరి ప్రమాదకరంగా తయారయ్యాయి. కంకర వేసి వదిలేసిన చోట కంకర రోడ్డంతా పరుచుకుంది. భారీ వాహనాలు వెళ్లినప్పుడు చెల్లాచెదురుగా పడి ఉన్న కంకర ద్విచక్రవాహనదారులపై పడుతోంది. అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన కల్వర్టుల వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. భారీ వాహనాలు వెళ్తున్న సమయంలో ఎగసి పడుతున్న దుమ్ము ధూళితో ప్రధాన రోడ్డులో ఉన్న వ్యాపారులు, జనాలు ఆపసోపాలు పడుతున్నారు. రోడ్డు పనులు ఎప్పుడు పూర్తవుతాయా అని ఎదురుచూస్తున్నారు.

సూచికలు లేక

రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులకు ఏది రోడ్డో ఏది గుంతో తెలియని ప్రమాదకర పరిస్థితి నెలకొంది. రాంపల్లి నుంచి చర్లపల్లి రోడ్డు, రాంపల్లి నుంచి ఘట్‌కేసర్ వెళ్లే రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడ్డ సంఘటనలూ ఉన్నాయి. అయినా సంబంధిత అధికారుల్లో చలనం రావడం లేదని స్థానికులంటున్నారు. ప్రమాదాల నివారణకు వారు తీసుకున్న చర్యలు శూన్యం అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా నాగారం మున్సిపాలిటీ రాంపల్లి వాసులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు పనులను పూర్తిచేయాలని, లేదంటే ఆందోళనకు వెనకాడేది లేదని వారు తెగేసి చెబుతున్నారు.


దుమ్ము రేగుతున్న నాగారం మన్సిపాలిటీ నుంచి వెళ్లే రాంపల్లి-చర్లపల్లి రోడ్డు

ఎప్పుడో కట్టిన ఇంటికి ఇప్పుడు పర్మిషన్!

- తాండూరు టౌన్ ప్లానింగ్ విభాగంలో అక్రమాలు?

తాండూరు, మే 21(ఆంధ్రజ్యోతి): తాండూరులో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, కమిషనర్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఎప్పుడో కట్టిన ఇంటికి గత జనవరిలో కమిషనర్ అనుమతులిచ్చారు. ఇంటి పన్ను కట్టించుకొని అనుమతిచ్చారు. టీజీబీపాస్ ఉన్నా నామమాత్ర ఫీజు కట్టించుకొని అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలొస్తున్నాయి. ఈ విషయం ఆర్టీఐ ద్వారా వెలుగులోకొచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. తాండూరులోని కరీంకాలనీలో ఇంటి (నం:6-8-76/17ఎ/1)ని కొన్నేళ్ల క్రితం నిర్మించారు. అయితే మున్సిపల్ అధికారులు ఏప్రిల్ 15న అది అక్రమ నిర్మాణంగా పేర్కొంటూ యజమానికి నోటీసిచ్చారు. దీంతో ఓనర్ తాను పర్మిషన్‌తోనే ఇంటిని నిర్మించుకున్నామని, ఆస్తిపన్ను సైతం చెల్లిస్తున్నట్టు ప్రూఫ్స్ చూపాడు. అయితే రికార్డుల ప్రకారం అది అక్రమ నిర్మాణమంటూ నోటీసులిచ్చి తర్వాత అధికారులు రూ.73వేలు కట్టించుకొని రెగ్యులరైజ్ చేయడం వెనుక అక్రమాలున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంత మేర ఇంటి నిర్మాణం, మరి కొంత ఖాళీ స్థలం ఉన్న ఇళ్ల యజమానులకు పూర్తిస్థాయి అనుమతుల కోసం డబ్బు డిమాండ్ చేస్తున్నారని, డబ్బులివ్వని వారికి అనుమతులు నిరాకరిస్తున్నారని పట్టణ వాసులు వాపోతున్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఇంటి పన్ను చెల్లింపు రసీదు


కమిషనర్ జారీచేసిన పర్మిషన్ ఆర్డర్

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు


మైనం రాములు

ఘట్‌కేసర్ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): మహిళ హత్య కేసులో నిందితుడికి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మొదటి అడిషనల్ జడ్జి జీవిత ఖైదు, రూ.8వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుశాపూర్‌లోని రైల్వే ట్రాక్ యూనిట్ 3, సమీప పొదల్లో 2021 జనవరి 4న ఓ మహిళ(35) మృతదేహాన్ని కుళ్లిన స్థితిలో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పటి సీఐ చంద్రబాబు సంఘటన చేరుకొని పరిశీలించి మహిళను పెట్రోల్ పోసి నిప్పంటించినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేపట్టారు. విచారణలో మృతురాలిని కూర వెంకటలక్ష్మిగా గుర్తించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఆమెను చంపింది సంగారెడ్డి జిల్లా కంది మండలం ఆరుట్లకు చెందిన మైనం రాములు(47)గా గుర్తించి అదుపులోకి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఐదేళ్ల విచారణ అనంతరం నిందితుడి నేరం రుజువైంది. బుధవారం జిల్లా మొదటి అడిషనల్ జడ్జి మైనం రాములు తీర్పు ఇచ్చారని ఘట్‌కేసర్ సీఐ పరశురాం వివరించారు.

వ్యక్తిని చంపిన మరో ఇద్దరికి...

ధారూరు, మే 21(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు, జరిమానా విధిస్తూ వికారాబాద్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలను ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడించారు. అవుపల్లికి చెందిన హరిజన్ రవి 2 సెప్టెంబరు 2015న హత్యకు గురయ్యాడు. ఇంట్లో ఉన్న రవిని గ్రామానికి చెందిన సోమారం సమ్మయ్య, అంతారపు శ్రీనివాసు మద్యం తాగేందుకని బయటకు తీసికెళ్లి హత్యచేశారు. రవి తల్లి ప్రమీలమ్మ ఫిర్యాదు ఆధారంగా అప్పటి ఎస్ఐ ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేశారు. అనంతరం సర్కిల్ సీఐ ఏవీ.రంగ దర్యాప్తు చేసి కోర్టులో సాక్ష్యాధారాలు సమర్పించారు. జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి సున్నం శ్రీనివాస్‌రెడ్డి నిందితులకు శిక్ష ఖరారు చేశారని ఎస్పీ చెప్పారు. సమ్మయ్య, శ్రీనివాసులకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధించారని ఎస్పీ వివరించారు. నిందితులకు శిక్ష పడేలా పనిచేసిన పీపీ సుధాకర్‌రెడ్డి, అప్పటి సీఐ, ఎస్‌లు, ప్రస్తుత సీఐ రఘురాములు, ఎస్ఐ అనిత కోర్టు అధికారి శంకర్, లైసన్ అధికారి వీరన్నలను ఎస్పీ అభినందించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పోచారం ఐటీ కారిడార్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారపల్లికి చెందిన ఎండీ నాజర్ అలియాస్ రజాక్‌కు రెండేళ్ల క్రితం మలక్‌పేట్‌కు చెందిన యువతితో పెళ్లయింది. నాజర్ కుటుంబ సభ్యులతో కలిసి చౌదరిగూడ, మక్తాలో అద్దెకుంటున్నారు. నాజర్ మద్యానికి బానిసకావడంతో కుటుంబ కలహాలు మొదలయ్యాయి. భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో నాజర్ బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొన్న బైక్.. వ్యక్తికి గాయాలు


గాయపడిన బుర్ర దత్తు

తాండూరు రూరల్, మే 21, (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ప్రకారం.. చంద్రవంచకు చెందిన బుర్ర దత్తు బుధవారం ఉదయం తన బైక్(ఏపీ37 బీపీ1832)పై తాండూరు వెళుతున్నాడు. డైమండ్ వే బ్రిడ్జి వద్ద రోడ్డుపై నిలిపి ఉన్న లారీ(టీఎస్52 ఏటీ6429)ని దత్తు బైక్‌తో ఢీకొట్టాడు. దత్తు బైక్‌పైనుంచి పడిపోయి తలకు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కులకచర్ల, మే 21(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టి యువకుడికి గాయాలైన సంఘటన మండల పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి 10గంటల సమయంలో పుట్టపహాడ్ నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న క్రమంలో గ్రామ శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న పుట్టపహాడ్‌కు చెందిన హరిశ్చందర్(17)కు, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా హరిశ్చందర్‌ను మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

చౌడాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో గేదె మృతిచెందిన ఘటన చౌడాపూర్ మండలంలో జరిగింది. బుధవారం గాలులకు కస్నన్‌కాల్వలో రాజేందర్‌రెడ్డి పొలంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మేత మేస్తున్న గేదె తీగలు తగిలి మృతిచెందింది. గేదె విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

శిశు మందిర్ పునఃనిర్మాణానికి రూ.10లక్షల విరాళం

వికారాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని పాత శిశు మందిర్ పునః నిర్మాణానికి పూర్వ విద్యార్థులు ముందుకొస్తున్నారు. పాత భవనం కూల్చి నాలుగంతస్తుల భవనాన్ని నిర్మించేందుకు పూర్వ విద్యార్థి, వ్యాపారవేత్త నాద్రిగ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం రూ.10లక్షలు అందించారు. శిశు మందిర్ ఈ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సంస్కృతి సంప్రదాయాల విలువ నేర్పుతుందని అన్నారు.

నిరుపేద కుటుంబానికి పెళ్లి కానుక అందజేత

కులకచర్ల, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పటేల్ చెరువు తండా మాజీ సర్పంచ్ శాంతి తులసీరామ్ పెళ్లికానుక అందించారు. తండా పరిధి సదన్‌చెరువు తండాకు చెందిన విస్లావత్ తులసి, రెడ్యానాయక్‌ల కుమార్తె సోన పెళ్లి గురువారం జరగనుంది. పెళ్లి కానుకగా మాజీ సర్పంచ్ క్వింటాలు బియ్యం, 15కిలోల వంటనూనె, ఇతర వస్తువులు అందించారు.

మహనీయుల విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి

కొడంగల్, మే 21(ఆంధ్రజ్యోతి): మహనీయుల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూత్ కాంగ్రెస్ జాతీయ కో-ఆర్డినేటర్ కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, బీసీసేన జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ముదిరాజ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటయ్య, అంబేడ్కర్ ప్రజాసంఘాల నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం అంబేడ్కర్ చౌరస్తాలో బొంరాస్‌పేట్ మండలం కొత్తూర్‌లో శుక్రవారం నిర్వహించే ఛత్రపతి శివాజీ, జ్యోతిరావు పూలె, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి అంబేడ్కర్ వాదులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నరేశ్, దస్తప్ప, వెంకటేశ్, రాము, అంజి, వెంకటయ్య, శ్రీనివాస్, మధు, మహేశ్, మొగులయ్య పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో హైడ్రా కూల్చివేతలు

పీర్జాదిగూడ, మే 21 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్, మేడిపల్లి సర్వే నంబర్ 26ఎ, సీపీఆర్ఐ పవర్ సంస్థ, సెజ్ స్కూల్ ప్రాంగణంలో ఆర్ఏఆర్ కాలనీకి సంబంధించిన రోడ్డు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని కాలనీ వాసులు ఇటీవల హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం హైడ్రా అధికారులు చేరుకుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు సీఐ సైదులు ఆధ్వర్యంలో జేసీబీలతో రోడ్డు ఆక్రమణాలను నేలమట్టం చేశారు. 15సంవత్సరాలుగా రోడ్డు కబ్జాపై పోరాడుతున్నామని, హైడ్రా మూలంగా ఇన్నేళ్లకు తమ కాలనీ రోడ్డు వినియోగంలోకి రానుండటంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- పరిశీలించిన కమిషనర్ రంగనాథ్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమాలపై హైడ్రాకుయ ఫిర్యాదులు అందడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సందర్శించి పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని పర్వతాపూర్ సర్వే నంబర్-1లో మైనార్టీల గ్రేవ్‌యార్డు కేటాయించిన స్థలంలో కొందరు వ్యక్తుల ఆక్రమించిన నిర్మాణాలు చేపట్టారని అందిన ఫిర్యాదు మేరకు కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రేవ్ యార్డులో నిర్మాణాలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులతో రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.